# పాపాయమ్మ పుట్టింటి ప్రయాణం

-పెన్మెత్స శ్రీకాంత్‌రాజు

ఉప్పు-నిప్పు అనే నానుడి పిచ్చేశ్వర్రావు, పాపాయమ్మలకు సరిగ్గా సరిపోతుంది. పెళ్లయింది మొదలు వాళ్ల భావాలు ఎందులోనూ కలవలేదు. రైలుపట్టాలు, ఉత్తర దక్షిణ ధృవాల్లా కలవని మనసులతో ఒకే కప్పు కింద కాపురం చేస్తున్నారు. పాపాయమ్మ పుట్టిల్లు విశాఖపట్నం. ఆమె సింగినాధం ఏకైక పుత్రిక. సింగినాధం కోర్టులో బిళ్ల బంట్రోతు. ఒక్కర్తే కూతురైన పాపాయమ్మని గారంగా పెంచాడు. గంగిగోవు లాంటి పిచ్చేశ్వర్రావుకు కయ్యాలమారి పాపాయమ్మనిచ్చి పెళ్లిచేసి అతనికి హైదరాబాద్ కోర్టులో బిళ్ల బంట్రోతు ఉద్యోగం వేయించాడు సింగినాధం.

పాపాయమ్మకు భర్తంటే లోకువ. అందుకు కారణం అతని ఉద్యోగం తన తండ్రి వేయించినదవడం, గారంగా పెరగడంవలన వచ్చిన తలపొగరుతనం. ఆ రోజు సాయంత్రం ఆరుగంటలకు అలసిపోయి ఇంటికి వచ్చాడు పిచ్చేశ్వర్రావు. నీరసంగా ఉన్న అతన్ని చూడగానే ఉత్సాహంగా సాధింపు మొదలుపెట్టింది పాపాయమ్మ.

"ఏమయ్యో! అసలు బట్టలు ఉతకాల్సిన బాధ్యత ఎవరిదయ్యా?"

"నాదే" ఏమయిందో అర్థంకాక భయం భయంగా అన్నాడు పిచ్చేశ్వర్రావు.

"నా జాకెట్లు, చీరలు ఉతికేస్తే సరా? డోర్ మ్యాట్‌ల మాటేమిటి?" గుమ్మాల దగ్గరవున్న మాసిన డోర్ మ్యాట్‌లను చూపిస్తూ హుంకరించింది పాపాయమ్మ.

"అది కాదు పావం..."

"నా పేరు పావం కాదు. అలా పిలిస్తే నాకు తిక్కరేగుద్ది" గర్జించింది పాపాయమ్మ.

"ఇంత చిన్న విషయానికి అంత కోపమెందుకు చెప్పు. నిముషంలో ఉతికి ఆరేస్తాగా" పిచ్చేశ్వర్రావు ఏడవలేక పిచ్చినవ్వు నవ్వేసాడు.

"ఊ...అలారా దారికి" శాంతించింది పాపాయమ్మ. పిచ్చేశ్వర్రావు బట్టలు ఉతుకుతుంటే కుర్చీ వేసుకుని "సబ్బు బాగా పెట్టు... బ్రష్‌తో బరికేయకు. చేత్తో రుద్దు... అదీ అలా..." అంటూ డైరెక్షన్ ఇవ్వసాగింది పాపాయమ్మ.

"అన్నట్లు చెప్పడం మరిచాను. మా నాన్న పండక్కి రమ్మని ఉత్తరం వ్రాసాడు" ముఖం చింకిచేటంత చేసుకుని అంది పాపాయమ్మ. పుట్టింటిని తల్చుకోగానే ఆమె ముఖం చింతపండేసి తోమిన ఇత్తడి బిందెలా తళతళా మెరిసింది.

"నీ ముఖం పీతాంబరితో తోమిన డేగిసాలా ఉన్నప్పుడే అనుకున్నాను మీ పుట్టింటి నుండి ఏదో కబురు వచ్చే వుంటుందని" డోర్‌మ్యాట్‌లు జాడిస్తూ అన్నాడు పిచ్చేశ్వర్రావు.

"నీవాళ్లెవరైనా ఉత్తరం రాస్తే నీ ముఖం మెరవదూ? ఇంతకీ పండక్కి వెడుతున్నామా లేదా? చెప్పి తగలడు"

"అది కాదు పావం... నీకు పడిశం పట్టినప్పుడు నాచేత వారంరోజులు సెలవు పెట్టించి ఊడిగం చేయించావు. మళ్లీ సెలవడిగితే జడ్జిగారు ఒప్పుకోరు. ఆయన్ని లెక్క చేయకుండా సెలవు పెడితే ప్రమోషన్ వెనక్కి వెళ్లేలా చేస్తారు" వాపోయాడు పిచ్చేశ్వర్రావు.

"పండుగరోజు ఎలాగూ సెలవే. పండుగ ముందురోజు, పండుగ తరువాత రోజు సెలవు పెట్టు చాలు. అసలా ఉద్యోగం మా నాన్న ధర్మం. నాకెదురు చెప్పావంటే ఉద్యోగం పీకించి పారేస్తాను. నీ బోడి ప్రమోషన్ నాలుగురోజులు ఆలస్యంగా వచ్చినా నష్టం ఏమీలేదు. టిక్కెట్లు కొను" ఆర్డర్ జారీ చేసింది పాపాయమ్మ.

ఒప్పుకోక తప్పింది కాదు పిచ్చేశ్వర్రావుకు.

★★★

'హైదరాబాద్ నుండి విశాఖపట్నం పోవు గోదావరి ఎక్స్‌ప్రెస్ బయల్దేరుటకు సిద్ధంగా ఉంది' ఆటో నుండి దిగుతున్న పాపాయమ్మ రైల్వేస్టేషన్ లోపలి నుండి వినబడుతున్న ఎనౌన్స్‌మెంట్‌కు 'కెవ్వు'మంది. ఓ చేత్తో లగేజి, మరో చేత్తో మొగుడి చేయి పట్టుకుని వేగంగా స్టేషన్‌లోకి వచ్చింది. సుడిగాలిలా కంపార్ట్‌మెంట్ నెంబర్లు చూసుకుంటూ తన కంపార్ట్‌మెంట్ నెంబర్ కనబడగానే చటుక్కున ఎక్కి మొగుడిని లోపలకు లాగింది. వీళ్లెక్కిన మరుక్షణం చిన్న కుదుపుతో కదిలింది గోదావరి ఎక్స్‌ప్రెస్.

"చోర్...చోర్.. పైసా పైసా" అరుస్తూ వస్తున్న ఆటో డ్రైవర్ పిచ్చేశ్వర్రావు కళ్లబడ్డాడు. అప్పుడు గుర్తుకొచ్చింది అతనికి తను డబ్బివ్వలేదని.

వెంటనే "నేను చోర్‌ని కాదు" అని అరుస్తూ జేబులోంచి ఓ యాభైనోటు తీసి అతని వైపు విసిరాడు. అది అతను అందుకోగానే కంపార్ట్‌మెంట్‌లోకి నడిచాడు.

పాపాయమ్మ, పిచ్చేశ్వర్రావు తమ బెర్తులు వెతుక్కుని కూర్చున్నారు. ఓ పదినిముషాలు ఆయాసంతో ఉక్కిరిబిక్కిరయ్యారు ఇద్దరూ.

"నీ ముఖం మండా! ఆఫీసు నుండి త్వరగా వచ్చి తగలబడకుండా రోజూమీద ఆలస్యంగా వస్తావా? ట్రైన్ వెళ్లిపోతుంది, మళ్లీ ఇంటికెళ్లిపోవచ్చు అని కుట్ర పన్నుతావా? సింగినాధం కూతురితోనే నాటకాలాడతావా? ట్రైన్ దిగనివ్వు నీ సంగతి చూస్తా?" ఆయాసపడుతూ అంది పాపాయమ్మ.

"అపార్థం చేసుకోకు పావం. ఆ జడ్జి పర్మిషన్ ఇవ్వలేదు. కోర్టులో అతను, ఇంట్లో నువ్వు... అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నాను" బాధగా అన్నాడు పిచ్చేశ్వర్రావు.

"ఏం కూసావ్? నన్ను కత్తెర అంటున్నావా? అట్ల పెనం ముఖం నువ్వూను. నీలాంటి బొప్పాయిగాడ్ని కట్టుకుని నేనేం బావుకుంటున్నాను?

ఒక సరదానా? సంబరమా? చక్కగా ఫ్యాషన్‌గా పాపాయ్ అని పిలువక పాపం...పాపం అంటూ ఓ పాపాత్మురాలిని పిలిచినట్లు పిలిస్తే నా మన సెంత క్షోభిస్తుందో ఎప్పుడైనా ఆలోచించావా?'' వలవలా ఏడ్చింది పాపాయమ్మ.


''సరే ఏడ్వకు. ఆకలి మండిపోతోంది. ఆ పులిహోర డబ్బా తియ్యి'' వాతావరణాన్ని తేలిక చేస్తూ అన్నాడు పిచ్చేశ్వర్రావు.

''అన్నిటిమాట ఎలా ఉన్నా తిండికి మాత్రం తక్కువలేదు'' విసుక్కుంటూ స్టీలు డబ్బా బయటకు తీసింది పాపాయమ్మ. ఆత్రంగా ఆ డబ్బా లాక్కుని మూత తీసి గుప్పెడు పులిహోర నోట్లో వేసుకున్నాడు పిచ్చేశ్వర్రావు.

''ఆ కంగారేంటి? నీ తిండి ఎవ్వరూ ఎత్తుకుపోరు. కాస్త నిమ్మళంగా తిని చావు'' చిరాకుపడింది పాపాయమ్మ. మొగుడ్ని కసిరి పెద్దసైజు బత్తాయిపళ్లంత పులిహోర ఉండలు చేసుకుని కొండ చిలువ మూతిలా ఈ చెవి నుండి ఆ చెవికి ప్రాకిన తన గుహలాంటి నోట్లో వేసుకుని రఫ్ ఆడించేయసాగింది పాపాయమ్మ.

తిండి విషయంలో ఆమెతో పోటీపడడం పీనుగులాంటి పిచ్చేశ్వర్రావు వల్లకాదు. కంగారు పడుతూ తనకి దక్కినంత మెక్కడం తప్పిస్తే పాపం పిచ్చేశ్వర్రావుకి మరో దారి లేదు.

భోజనాల కార్యక్రమం అయ్యాక నిద్రకు ఉపక్రమించడానికి ముందు టాయ్‌లెట్‌కు వెళ్లింది పాపాయమ్మ. అక్కడ కింద కూర్చుని ఉన్నారు ముగ్గురు రౌడీల్లాంటి కుర్రాళ్లు. మాసి, చిరిగిన బట్టలు, తైల సంస్కారం లేని జుట్టు... హిందీలో ఏదో మాట్లాడుకుంటున్నారు. పాపాయమ్మ దూకుడంతా సాధుజంతువైన పిచ్చేశ్వర్రావు మీదే. ఆమెకి దొంగలన్నా, రౌడీలన్నా తగని భయం. టాయ్‌లెట్ నుండి తిరిగి వచ్చేటప్పుడు ఆ రౌడీ వెధవల్లో బాగా నల్లగా ఉన్నవాడు తన వంకే క్రూరంగా చూస్తున్నట్లు అనిపించింది పాపాయమ్మకు. ఒక్క అంగలో తన భారీ కాయాన్ని కుదుపుకుంటూ తమ బెర్తులున్న చోటుకు చేరుకుంది. ఆమె గుండె కాసేపు భయంతో దడదడా కొట్టుకుంది.'గొర్రెలాంటోడని, గొడవ వుండదని ఈ పిచ్చేశ్వర్రావులాంటి పీచు ముఖానికి కట్టబెట్టాడు మా నాన్న. ఏ పహిల్వాన్‌ను చేసుకుంటే నా ధన మాన ప్రాణాలను



కాపాడగలిగేవాడు' బక్కపల్చగా ఉన్న పిచ్చేశ్వర్రావును చూసి మూతి ముప్ఫయి వంకర్లు తిప్పుకుంది పాపాయమ్మ. మిడిల్ బెర్త్‌మీద పాపాయమ్మ, లోయర్ బర్త్‌మీద పిచ్చేశ్వర్రావు పడుకున్నారు. ఉయ్యాల ఊపు తున్నట్లున్న ట్రైన్ కదలికలకు త్వరగానే నిద్ర పట్టేసింది ఇద్దరికీ.


★★★

అర్ధరాత్రి ఒంటి గంట అయింది. గోదావరి ఎక్స్‌ప్రెస్ తారాజువ్వలా దూసుకుపోతోంది. ఇంతలో హఠాత్తుగా ఎవరో పాపాయమ్మ మీదపడి ఆమె బంగారు పుస్తెలతాడు లాగెయ్యసాగారు. తనమీద పిడుగు పడ్డట్టు అదిరిపోయింది పాపాయమ్మ. కొన్ని క్షణాలకు కానీ ఆమెకు జరుగుతున్న దేమిటో అర్ధంకాలేదు. అర్ధమయిన మరుక్షణం తను గట్టిగా అరవాలన్న సంగతి స్ఫురించి కెవ్వున అరిచింది. "బాబోయ్... ఎవడో దొంగ వెధవ... రక్షించండర్రో..." బొబ్బలు పెట్టింది పాపాయమ్మ.



## గడుసు పిల్ల

ఈమధ్యనే బ్రిటన్‌వెళ్లి తిరిగొచ్చిన షమితా శెట్టిని- 'మీ అక్కలాగా మీరు కూడా 'బిగ్‌బ్రదర్' రియాల్టీ షోలో పాల్గొనడానికే ఇప్పుడు అక్కడికెళ్లి వచ్చారట కదా' అని ఓ ఆసామీ ప్రశ్నిస్తే- 'అసలు నాకు టీవీ తెరపై కనిపించాలనే ఇంటరెస్ట్ లేదు. అలాంటప్పుడు ఇలాంటి ఊహలకు తావే లేదు' అని కొట్టిపారేసింది. అలాగే 'శిల్పాశెట్టి త్వరలోనే పెళ్లి చేసుకుంటానంది కదా మరి మీరు కూడా?' అని అంటే- 'మా అక్క పెళ్లి సంగతి ఆమె చెప్పనే లేదు. ఇక నా మాటెందుకు వస్తుంది? అయినా అప్పుడే నాకు పెళ్లేంటి?' అంటూ ఆశ్చర్యపోతోంది షమిత. ఎంతయినా గడుసుపిల్లే కదా!




ఆమె పెడుతున్న బొబ్బలకు కంపార్ట్‌మెంట్‌లో అందరూ ఉలిక్కిపడి లేచారు. చీకట్లో ఏం జరుగుతోందో ఎవ్వరికీ అర్ధంకాలేదు.

"అయ్యో దేవుడా! నన్ను రక్షించే దిక్కేలేదా? వీడెవడో నా గొలుసు కోసం నా పీక పిసికేస్తున్నాడు. ఏమయ్యో పిచ్చెయ్యా... నీ నిద్ర తగలెయ్యా... ఇంకా లేచి చావలేదా?" భయంతో కళ్ళు తెరవకుండానే దిక్కులు పిక్కటిల్లేలా రోదించసాగింది పాపాయమ్మ.

మత్తు నిద్రలోవున్న పిచ్చేశ్వర్రావు తుళ్లిపడి లేచాడు. పాపాయమ్మ అపాయంలో ఉందని గ్రహించాడు.

"ఒరేయ్... మా ఆవిడకే హానీ చేద్దామని చూస్తావురా దొంగనాకొ..! మర్యాదగా మా ఆవిడని ఒదలకపోయావో తిత్తి తీసి తాట వలుస్తా వెధవ నాయాలా" ఉద్రేకంతో ఊగిపోతూ అరిచాడు పిచ్చేశ్వర్రావు.

ఇంతలో కంపార్ట్‌మెంట్‌లోని లైట్లన్నీ ఒకదాని తరువాత ఒకటి వెలిగాయి. ఆ వెలుతురులో పాపాయమ్మ వైపు చూసిన పిచ్చేశ్వరరావు ఆశ్చర్యచకితుడయ్యాడు. కారణం... పాపాయమ్మను హత్తుకుపోయి ఉన్నాడో నాలుగేళ్ల పిల్లాడు. నీళ్లు చల్లగానే మంటారిపోయినట్లు పిచ్చేశ్వర్రావు కోపం చల్లారిపోయింది. ఆ పిల్లాడ్ని పాపాయమ్మ మీదనుండి లాగాడు.

"నేను దొంగను కాను... నేను దొంగను కాను..." వణికిపోతూ ఏడుస్తున్నాడు ఆ పిల్లాడు.

"ఒరేయ్ నానీ..." ఒకావిడ ముందుకొచ్చి ఆ అబ్బాయిని ఎత్తుకుంది.

"అమ్మా! నేను నీ దగ్గరే పడుకుంటాను" బిగ్గరగా ఏడ్చాడా అబ్బాయి.

"అలాగేలే. ఇంతకీ ఏమైందిరా" అడిగిందావిడ.

"నిద్రలో ట్రైన్ కుదుపుకు నేను పైబెర్త్ మీద నుండి ఈ ఆంటీ మీద పడ్డాను. పడిపోతానేమోనని ఆవిడనే గట్టిగా పట్టుకున్నాను. ఆవిడ నన్ను దొంగా అంటోంది" వెక్కుతూ అన్నాడు నానిగాడు.

అంతే! కంపార్ట్‌మెంట్‌లో నవ్వులు వెల్లివిరిసాయి.

'ఆ టాయ్‌లెట్ దగ్గర కన్పించిన రౌడీవాడు నా గొలుసు లాక్కోడానికి వచ్చాడనుకున్నాను' తన అర్ధంలేని భయానికి సిగ్గుపడుతూ అనుకుంది పాపాయమ్మ. ఎవరి బెర్తులపైకి వాళ్లు చేరాక లైట్లు ఆర్పేసారు.

పాపాయమ్మ కొంచెం వంగి క్రింద బెర్త్‌మీదున్న పిచ్చేశ్వర్రావు చేయి అందుకుని మెల్లగా "ఏమండీ! మీకు నేనంటే ఎంత ప్రేమండీ? మూర్ఖురాలిని ఇన్నాళ్లు గ్రహించలేకపోయాను. మీరు 'ఒరేయ్ మా ఆవిడకే హాని చేద్దామని చూస్తారురా దొంగనాకొ..' అని ఎంత కోపంగా అన్నారండీ. 'మర్యాదగా మా ఆవిడ్ని వదలకపోతే తిత్తితీసి తాట వలుస్తా వెధవ నాయాలా' అని ఎంత రౌద్రంగా అన్నారండీ. నామీద ఎంత ప్రేమ లేకపోతే మీరలా అనగలరు చెప్పండి. ఇన్నాళ్లు మిమ్మల్ని అర్ధం చేసుకోకుండా ఈటెల్లాంటి మాటలతో బాధపెట్టాను. నన్ను క్షమించండి. ఇకనుండి మీ మాటే నా మాట" అంది పాపాయమ్మ.

"పాపం" ఆనందం తట్టుకోలేక చిన్నగా అరిచాడు పిచ్చేశ్వర్రావు.

"నేను విన్నది నిజమేనా? కలకాదుకదా? ఏదీ ఓసారి గిల్లు" అన్నాడు .

"అపచారం. మిమ్మల్ని గిల్లి ఈ పాపాయమ్మ పాపాత్మురాలు అవాలనా? దయచేసి అలాంటి అప్రాచ్యపు మాటలు ఇంకెప్పుడూ మాట్లాడకండి. కావాలంటే ఇది నిజమేనని మిమ్మల్ని నమ్మించడానికి కితకితలు పెడతాను" అంటూ పాపాయమ్మ కితకితలు పెట్టసాగింది.

పకపకా నవ్వసాగాడు పిచ్చేశ్వర్రావు.

పామూ ముంగిసల్లా ఎప్పుడూ పోట్లాడుకునే పిచ్చేశ్వర్రావు, పాపాయమ్మ చిలుకా గోరింకల్లా కలసిపోవడంతో హర్షాతిరేకంగా కూతేసి మరింత ఉత్సాహంగా దూసుకెళ్లిపోసాగింది గోదావరీ ఎక్స్‌ప్రెస్!

★